"పార్వతీ గ్రేటా? పరమేశ్వరుడు గ్రేటా?"

"రామాయణ, భారతాల్లోన కొశ్చినదుగు. ఓచ్. ఛేలంజీవోయ్. శివపురాణం మనకింటరెస్ట్ సబ్జెక్ట్‌గాదు. శివపురాణం - ప్యూర్ లవ్‌స్టోరీ! రామాయణ, భారతాల్లోని పొలిటికల్ నాలెడ్జి- శివపురాణంలో వుండదు" సనపల వెంకట్రావు కుర్చీలో రిలాక్స్‌డ్‌గా కదిలి, కాళ్లు బార్లాచాపి, జవాబిచ్చేడు.

ఎదురుగా కూర్చున్న - ఇట్రాతు ఈశ్వ్రరావు - దేన్నో పసిగట్టి గభాల్న ముడుచుకున్న తాబేళ్లా - కాళ్లు కూడదీసుకున్నాడు.. వెంకట్రావు చాపిన కాళ్లు తగలకుండా.

ప్రశ్నించిన చల్లా బంగార్నాయుడు విసుగ్గా వెంకట్రావు వైపు చూసి - జవాబు కోసం ఈశ్వ్రరావు వైపు కళ్లను ప్రశ్నార్థకంగా నిలిపేడు.

అడ్డంగా ఊపి, జూలుదులిపి, కాళ్లు కూడదీసుకుని కూర్చునే జూలుకుక్కలా - కుర్చీ మీదకు కాళ్లు మడతవేసుకు- ప్రశ్నించేడు ఈశ్వ్రరావుని సనపల వెంకట్రావు.

అప్పటికి ఈశ్వ్రరావుకి జవాబులు రూపుదిద్దుకున్నాయి. కూడదీసుకున్న కాళ్లను నెమ్మదిగా - తాబేలు నోరూ, కాళ్లూ బయటికి తీసినట్లు - తీసి బార్లా చాపాడు.

"...మనం ఫ్రెండ్లీగా మాట్లాడుకుందామా? కమర్షియల్లీగానా...?" అని ప్రశ్నించేడు.

చిరుతపులీ, జూలుకుక్కా సైలెంట యిపోయేయి.

అప్పటికి పొద్దు పూరాగా - ఖర్చయిపోయింది. వీధిలైట్లు వెలిగినకాడకి వెలిగేయి. 'విద్యాట్యుటోరియల్స్' కరెస్పాండెంట్ రూము - ఎయిర్‌కండిషన్డ్‌గావటంతో వర్షంలో చీకటిలా వుంది. ఈశ్వ్రరావే లేచి, స్విచ్‌వేసి, ట్యూబ్ వెలిగేక యిద్దరి మొహాల్లోకి చూస్తూ -

# మిసెస్ పార్వతీ ఈశ్వ్రరావ్



"...సర్పంచ్ గొప్పా? సర్పంచ్ భర్త గొప్పా...?" రివాల్వింగ్ ఛైయిర్‌లో కదుల్తూ, మరో ప్రశ్నవేసాడు బంగార్నాయుడు.

ఈశ్వ్రరావు - గొంతు సవరించుకుంటున్నాడుగానీ జవాబులు రూపుదిద్దుకోవడం లేదు.

"..మన టుటోరియల్ కాలేజీ ఫేకల్టీ మెంబర్స్ యింటర్వ్యూకి - నిన్న నువ్వు రాకపోవటం వాళ్ల దృష్టం..." తన జోక్‌కి, తనే నవ్వుకుని వెంకట్రావు బార్లా చాపిన కాళ్లను ఒకదానిమీద మరొకటివేసి- ఊపసాగేడు - జూలుకుక్క తోక ఊపినట్లు!

గుబురు తుప్పల మీద - చిరాగ్గా కదిలే చిరుతపులిలా - రివాల్వింగ్ ఛైయిర్‌లో అటూ, యిటూ కదుల్తున్నాడు బంగార్నాయుడు.

తాబేలూ, జూలుకుక్కా, చిరుతపులీ... వొకే గ్రామారణ్యంలోనివి. ఆ గ్రామం పట్నానికి నాలుగుకిలోమీటర్ల వ్యాసార్ధ దూరంలో వుంది. మున్సిపాల్టీకి - నాలుగువార్డుల పంచాయితీ దూరంలో వుంది. జిల్లా కేంద్రమైన పట్నం - యిటీవల నగరంగా యెదుగుతూ - గట్లు తెగిన వరద నలువైపులా చెదిరినట్టు - యెదిగి యెదిగీ, గ్రామసరిహద్దుల్ని ఆక్రమిస్తోంది.

"...వచ్చే ఎలక్షన్ వరకే. తర్వాతెలాగూ - యిదంతా మున్సిపాల్టీలో కల్సిపోద్ది- నైజాం ఏరియా - యూనియన్ గవర్నమెంట్‌లో కల్సినట్లు! ఖాయం. దాన్నెవ డాపలేడు. ఈలోపే మనచేతిలో పని..." రివాల్వింగ్ ఛైయిర్‌ని ఈశ్వ్రరావు వైపు తిప్పి - పలికేడు బంగార్నాయ్డు.

"...మళ్లీ అదేమాట! మనచేతిలో పనంటావేటివోయ్? సర్పంచ్ చేతిలో పని! సర్పంచ్ మనచేతిలో మనిషి అనుకున్నాం కాదు. కాదు గద రా...?" తలా, కాళ్లూ

"...ఫ్రెండ్‌షిప్ గొప్పా? పార్టనర్‌షిప్ గొప్పా?" అని మరో ప్రశ్నవేసి కూర్చున్నాడు.

అతనికాక్షణాన - వీర్ని ఆటపట్టించాలని వుంది. అది గ్రహించిన బంగార్నాయుడు-

"....నీకంటే నీపెళ్లాం గొప్ప..." అన్నాడు కక్షగా.

"గొప్పే. సర్పంచ్! ఊరికి ప్రధమ పౌరురాలు..."

"అయితేటిటా? ఊర్ని ఉద్ధరించేస్తాదా?"

"...అలాటి వాగ్దానమే చేసాం..."

"....వాగ్దానాలకి ఓట్లు రాలిపోలేదు. ఎలాగ్గెల్చిందో, యెవరు గెలిపించారో మర్చిపోకు..." బంగార్నాయుడు ఆవేశపడిపోయేడు. వెంకట్రావు గ్రహించి, వాతావరణాన్ని సౌమ్యపరిచే ప్రయత్నంతో -

"...ఊర్ని ఉన్నపళంగా జపాన్ జేసీ లేరుగానీ, గతం మర్చిపోయి మాట్లాడకు. నిదానంగా ఆలోచించురోరే - ఈశుగే..." అన్నాడు స్నేహంగా.

"...ఈశుగే అను. ఈరేశుగోడి కొడుకుని గదా! పాలేరోడి కొడుకు - పార్లమెంటు మెంబరైనా పాలేరే మీకు..." క్రోధంగా పలికేడు ఈశ్వ్రరావు.

అతనికా క్షణాన - తన బాల్యం గుర్తొచ్చింది. నాయుడోళ్ల బిడ్డల్తో స్నేహం కోసం - పడిన ఆరాటం గుర్తొచ్చింది. తన తండ్రి వేటాడి తెచ్చిన - పూరిడుపిట్టల్నీ, కముజు పిట్టల్నీ, గోరింకలనూ - తెచ్చి వీళ్లకిచ్చేవాడు. వీళ్లూ వాట్ని అపురూపంగా అందుకొని, జట్టుగలిపేవారు గానీ, ఆ స్నేహం కొన్నాళ్లే! పిట్టలూ, గోరింకల ప్రాణాలున్నన్నాళ్లే...! "...ఫ్రెండ్లీగా పిల్చేన్రా. దానికి అపార్థమేనా? ఇదేన్రా నీ విజ్ఞానం...?" నొచ్చుకుంటూ, అడిగేడు వెంకట్రావు.

"ఆడి విజ్ఞానం కేమిరా? లోకమంతా

**ఎ. అప్పల్నాయుడు**

చూస్సిన బ్రహ్మంగారి శిష్యుడు..." వ్యంగ్యం గా పలికేడు బంగార్నాయుడు.

"...నూతిలోని కప్పలం. నువ్యే మాకు లోకం. మీ అంతలోకం - మామెక్కడ సూడగలం? చూడబోయినా - చూడనిస్తారేటి మీరు...?"

"...అయితే, నీ పెళ్లాన్ని సర్పంచ్‌గా నిలబెట్టమని చెప్పిందెవరు? నిలబెడితే, గెలి పించిందెవరు?"

"మనం నిజాలు మాట్లాడుకుందామా?"

"అంటే; నీ భార్యని ప్రపోజ్‌జేసి - గెలిపించటం అబద్ధమా?"

"...అర్ధసత్యాలు - అసత్యాలకంటే ఘోరం..." ఈశ్వ్రరావూ తగ్గటం లేదు. అతనికాక్షణాన- సర్పంచ్ ఎన్నికల సందర్భాన తన మామ చెప్పిన మాటలు గుర్తొచ్చేయి...

"...నాన్నమ్మను నమ్మనుగాక నమ్మను. లాభం లేకపోతే - సావుకారి గెడ్డల మునగడు. మునగడురో! ఊరు సర్పంచ్ పదవిని - స్నేయితం కిందఇచ్చేత్తారా? నీ భార్యకా?"

నాకు తెల్సు. ఈ ఊరిసంగత్తెల్సు. అంటూ, ముట్టూ, మడిమడీ - అసింటాపోరా... పో...అదీ...నాయినా అవన్నీ అనుబగించినోడ్ని - ఈనాటికి - ఎస్సీవోళ్ల ఆడమనిషికి పదవినిచ్చెస్తంద్రా? పోనుండు, సెప్తానుండు. ఈ ఊరు యే తీరవగా మారాదో సెప్తానుండు. ఇనుకో! ఇంటే- యిందలి రాజకీయం బోదపడతాది!

ఇదిగిదిగీ ఊరిల పెద్దరైతు, సిన్నరైతు, అనాదిమనాదోడు - కుమ్మరి, కమ్మరి, సాకలీ, మంగలి, మాలామాదిగా - వొకే సినిమాహాళ్ల - టిక్కెట్లవారీ సీటింగుల్లాగ - తేడాపాడాల్తోటి వుండీవోరు.

పెద్దరైతులుకి భూముల మీది ఫలసాయం - యేటా మిగిలిపోయింది. దాన్ని పట్నం - దగ్గిర గదా మనకి - అక్కడ యిళ్లాస్తుల మీదా, మిల్లులమీదా పెట్టుబడి పెట్టేవోరు. ఆటిమీద లాభాల్ని మళ్లా యిక్కడ భూముల మీద పెట్టీవోరు. మునుపెన్నడు - రైతోడు కొనలేని. తేలేని

ట్రాక్టర్లనీ, మోటార్ యింజన్లనీ, ఎరువుల మూటల్నీ దించి - యెన్నడెరగని ఫలసా'యాన్ని తీసివోరు. దాంతోటి - పట్నంలా, పల్లెలా పెద్ద రైతోడు - మోతుబరోడయినాడు. అదిగాళ్లకి రాచకీయం ఆది నుండీ 'చేతి'లోన యిమిడిపోయింది.

చిన్నరైతోడు - యవసాయంల మదుపు పెరిగిపోయి, మోటార్లు, ట్రాక్టర్లూ అద్దెలకి అప్పులు జెయ్యటం - ఇటు యిళ్లల్ల - యింతకమునుపు లేని కర్చులు - కరెంటూ, ఫేన్లూ, పిల్లలకి కాన్వెంట్ సదువులు, సిల్కు సిల్కు గుడ్డలూ, సింగారాలు, పెళ్లీ పేరంటాళ్లు - అటేమో -పంటల ధరలు పండించినదానికి తగ్గీ, పండనిదానికి పెరిగే - మాయజూదమయ్యింది మార్కెట్టు. దాంతోటి చిన్న రైతోడు చిదిగిపోడమేగాని, మరెదగనేదు. రాజకీయం యితగాడికి ఎరగని యిద్య!

అనాదిమనాదోళ్లు, కులవృత్తులోళ్లు యేదయినారు? తిండికీ, బట్టకీ, బతుక్కీ కర్చు పెరిగినట్టుగ - కూలిరేట్లు పెరగలేదు. దానిమీద, మోటార్లూ, టాక్టర్లూ పొలాలకొచ్చి - కూలినాలీల్ని ఒడ్డుమీదకి తగిలీసేయి. కూలిపన్లు తగ్గిపోనాయి. దాంతోటి, ఊరిల ఉపాధి కరువయి - పట్నంల నేర్సుకున్నడో, పల్లెల కడుపుకాలి బోధపడిందో - యిళ్లకి కమీనిస్టు రాజకీయం...కంటికి ఆనింది! ఇపుడయితే - మనకి దళితసంగాలొచ్చినాయి.

ఇటు మోతుబరోడూ గాక, అటు చిన్న రైతోడు గాక - మద్దెకాన సిగురుపచ్చగ కొందరుండీవోరు! ఆళ్లు - సంతల్లంట దళారీ యాపారాలు, సారా యాపారాలు, జూదాలు నడిపీ - కాసులు సంపాదించీవోళ్లు. ఊరు యిదిగిలాగ మారుతున్నపుడే - బేంకుల్నించి సబ్సిడీ ఋణాలూ, గవర్నమెంటు స్కీములూ వొచ్చేయి. యాపారాల్తోటి కాసులు కూడేసినోళ్లే - బేంకుల్లంట, ఆఫీసుల్లంట - పథకాల్ని పండించుకున్నారు. ఇదిగీ పండించుకున్న కాసుల్ని - పట్నంల బ్రాందీ షాపులకీ, లాడ్జింగు యాపారాలకీ మదుపులెట్టడంకి యెగబాకినారు! ఇదిగీ చిగురుపచ్చజాతే - నడమంత్రపు సిరి జాతి! ఈళ్లకి - కొత్తగ పుట్టీ అధికారంకి యెక్కడికక్కడ యెగబాకిన రాజకీయ పార్టీ - అడ్డా అయ్యింది!

అదిగో, ఆ నడమంత్రపు సిరోడో, యా మోతుబరోడో పల్లెనిండి పట్నం దాకా - పోటీ పడతంద్రు! ఆళ్ల రాచకీయం - అప్పుడపుడు అనాదిమనాదోళ్ల మద్దెకాన అగ్గి పుట్టిస్తుంది. ఒకసారి యీడూ, మరోపాలి ఆడూ - మన అనాది మనాదోలి కోసమే అన్నట్టిగ - రాచకీయం నడుపుతారు. మన అనాది మనాదోయం - అలగే - ఒకపాలి అటూ, వొకపాలి యిటూ...ఊగతంద్రు...!

నాయినోరే, నువ్వో, నీ భారియో - ఊగినా...మనకి మేలు జరగదు. బంగారు బాతు కత అయిపోద్ది. ఇంకా ముతగ్గా సెప్తానినుకో - కోతిగెంతటం సాయిబు దబ్బులు దండుకోడం తీరవగవుతాది. విదిశిలొచ్చ రం. ఆc..."

అదో హెచ్చరిక! ఈశ్వర్రావుకి అక్షర మక్ష రమూ గుర్తున్నహెచ్చరిక! గానేం లాభం...?

"గెలిపించినందుకు, కాంట్రాక్టువర్కులన్నీ నువ్వే దొబ్బేవు..."ముతగ్గానే, దెప్పిపొడిచేడు ఈశ్వర్రావు.

"...ఎన్నికల ఖర్చుకి మదువు పెట్టేను గదా మరి...?"

ఎంతకీ, యిద్దరూ చల్లబడకపోవటంతో, సనపల వెంకట్రావు - డైరెక్టుగా టర్మ్స్ మాట్లాడడం మంచిదని భావించి -

"...సరే, ట్యుటోరియల్స్‌లో నీకు 'టూ' పర్సెంట్ షేరిస్తాం..." అని ఆఫర్‌జేసాడు.

"అవతల బాబ్జీగూడా సెంటుధరమీద టెన్‌పర్సెంట్ కమీషనూ, తను పెట్టబోతోన్న మెడికల్ కాలేజీలో మా అబ్బాయికి సీటూ - ఆఫర్‌జేసాడు..."

"...మీ అబ్బాయింకా ఇంటర్ ఫస్టియర్ గదరా...?"

"...ఇప్పుడు అగ్రిమెంట్ రాసిస్తాడు, ఇంటరవగానే చేర్చుకుంటానని..."

"అయితే, స్నేహానికి ద్రోహం జేస్తావా?" బంగార్నాయుడు కోపగించేడు.

"వొద్దు. స్నేహమూ ద్రోహమూలాంటి - అజీర్ణం కబుర్లొద్దు. నాచిన్ననాడు పూరిడు పిట్టలూ, గోరింకలవాడుగానీ, యిప్పుడీ బంగారుగుడ్ల బాతువాడు గానీ మనమధ్య స్నేహం లేదు! ఇదంతా ప్యూర్ బిజినెస్! ఇంకెక్కువ మాట్లాడొద్దు..." కరుకుగా పలికేడు ఈశ్వర్రావు.

**వొద్దు. స్నేహమూ ద్రోహమూలాంటి - అజీర్ణం కబుర్లొద్దు. నాచిన్ననాడు పూరిడు పిట్టలూ, గోరింకలవాడుగానీ, యిప్పుడీ బంగారుగుడ్ల బాతువాడు గానీ మనమధ్య స్నేహం లేదు! ఇదంతా ప్యూర్ బిజినెస్!**

సహాయం రూపేణా నిధులిచ్చేం గదా' అనే ధనికదేశాధినేతకు - నీ సహాయం వెనక, నీ వ్యాపారమున్నది. నీ నిధులకు - లాభాలుదీసే విధానమున్నదని బడుగు దేశాధినేత బదులిచ్చినట్లన్పించింది ఈశ్వర్రావు జవాబు - వెంకట్రావుకి.

"దీపమున్నపుడే యిల్లు చక్కదిద్దుకోవాల గదా..." నిదానంగా, తన నిర్ణయం వెనక గల తాత్వికతను వెల్లడించేడు ఈశ్వర్రావు.

"చక్కదిద్దటానికసలు - యిల్లే మిగలక పోగల్దు, జేగర్త..." అగ్రదేశపునేతలా బెదిరించేడు బంగారునాయుడు.

"...దీపమారిపోద్దేమోగానీ - యిల్లుపోదు..." అయిల్‌కంట్రీస్‌నేతలా జవాబిచ్చేడు ఈశ్వర్రావు.

"వార్డు మెంబర్లని కొనేసి - సర్పంచ్ మీద నో కాన్ఫిడెన్స్ పెట్టిస్తాను..."

"...అదు బాబ్జీ గూడా - నీ కాంట్రాక్ట్ వర్క్సన్నిటి మీదా ఎంక్వయిరీ పెట్టిస్తాడట..."

"...అయితే నువ్వు బాబ్జీగాడి రాజకీయాల్లోకి వెల్తావన్నమాట...?" బంగార్నాయుడు కుతకుతలాడ్తున్నాడు.

"మనం క్లాస్‌మేట్స్‌ం రా. ఇవ్వేళ్టి స్నేహమా మనది. మాకూ, బాబ్జీకీ వొకేలా చూస్తావా...?" నొచ్చుకున్నాడు సనపల వెంకట్రావు. "...నిజమే. మిమ్మల్ని పూర్తిగా యెరిగున్నవాడ్ని గనక - యెంతవరకూ నమ్మొచ్చో తెలుస్తుంది. బాబ్జీతో అది తెలీదు. అందుకనే జంకుతున్నాను. మిమ్మల్ని వదల్లేకపోతున్నాను..." కొంచెం ఫ్రెండ్లీగా మాట్లాడేడు ఈశ్వర్రావు.

"...మరాలోలించు. టూ పర్సెంట్ షేరంటే తక్కువగాదు. గాక, మాతో శాశ్వత పార్టనర్‌షిప్..." వరల్డ్‌బ్యాంక్ అధికారిలా, నచ్చజెప్పేడు వెంకట్రావు.

"సరిసంఖ్య నాకునచ్చదు. మేము ముగ్గు రం. త్రీ పర్సంట్ జేసియ్యండి..."

"...పోనలాగేలేరా. నువ్వింకేమనకయ్యా నాయుడూ..."వ్యవహారం సెటిల్ జేసే ధోరణిలో చెప్పేడు వెంకట్రావు.

"మరో చిన్న షరతు..." ఈశ్వర్రావు.

"చెప్పి తగలడు..." బంగార్నాయుడు.

"మీ అక్క కొడుకు పెళ్లికి - మినిస్టరొస్తన్నారు గదా...."

"...అయితే...?"

"కొన్ని సంస్థలకి బోర్డుడైరెక్టర్లని -ఆయన సిఫార్స్ జెయ్యొచ్చటగదా?"

"...కావొచ్చు.."

"..ఆయన తల్చుకుంటే - దూరదర్శన్ పాలకమండలి మెంబరవచ్చట..."

"ఎవరవొచ్చు...?"

"...నేనుగానీ, మా పార్వతిగానీ..." గుటకలు మింగుతూ ఈశ్వర్రావు.

"సర్పంచ్ చేతిలో పనికి - మినిస్టర్ చేతిలో పనిని బేరం బెడ్డేవన్నమాట. రాజకీయాల్లోకి నీలాటోడ్ని తేవడం ప్రమాదమే..." కొంచెం స్నేహపూర్వకగొంతుతో పలికేడు బంగార్నాయుడు.

"...ఇంతకీ మా ఆవిడేమంటాదో...?" టేబిల్ మీది పేపర్‌వెయిట్ తిప్పుతూ నిలబడ్డాడు ఈశ్వర్రావు.

"...మరింక తిరుగుండడానికి వీల్లేదు. వొచ్చే పంచాయితీ మీటింగులో తీర్మానం జరిగిపోవాలి. ఆc..." అని ఖరాఖండీగా చెప్పి; ఆ రకంగా వొప్పందాలు పూర్తయ్యాక - మిత్రత్రయం ఆ గదినుంచి నిష్క్రమించేరు.

**   **   **

వారం రోజులుగా మిసెస్ పార్వతీఈశ్వర్రావు మనసులో తుఫాను రేగుతోంది. చీటికీ మాటికీ కాట్లాటకు దిగుతోన్న భర్త! ఇంకో వైపు బాబ్జీకి అనుకూలంగా రాయభారం నడుపుతూ, పెద్దదాని హితవు - కుటుంబ క్షేమం - మంచీమర్యాదా గుర్తుజేస్తున్న బావగారు!

మనసు నిండా - తన మీదనే ఆశలు పెట్టుకున్న గ్రామపేదలు!

గ్రామపంచాయితీ రిజర్వు స్థలం అయిదెకరాలు! పట్నానికి చేరువలో వుంది! అప్పటికే - ఆ స్థలం ప్రక్కనున్న ప్రైవేట్ స్థలాలన్నీ రియలెస్టేట్ రూపంలో అమ్ముడయి - అందమయిన కాలనీలయినయి!" రిజర్వు స్థలాలను అమ్మేసి - అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చు" - అన్న జీవో ఒకటి రావటంతో - ఆ స్థలం మీద బంగార్నాయుడూ, బాబ్జీ చెరోవైపు దృష్టి సారించేరు. సేవా రంగ సంస్థలకు - ధరలో రాయితీ వుంటుంది. చవగ్గా కొట్టేయవచ్చునేసరికి - యిద్దరూ పావులు కదపసాగేరు.

"విద్యా చిట్స్ అండ్ ఫైనాన్స్", "విద్యారియలెస్టేట్" వ్యాపారాల్లోంచి; విద్యారంగంలో సేవజేసేందుకు "విద్యాట్యుటోరియల్స్" ఆరంభించేడు బంగార్నాయుడు. ఎల్‌కేజీ నుంచి - పీజీ దాకా 'విద్యా ట్యూటోరియల్స్' విద్యనందించుతుంది. ఇటీవలే, యూనివర్సిటీ పాలకమండలి మెంబరయ్యేడు గూడా! ఆ విధంగా, విద్యారంగ సేవకు - ఆ అయిదెకరాలూ రాయితీ ధరతో కొట్టేయాలని అతని ప్రయత్నం.

బాబ్జీ - " వంశధార బార్ అండ్ రెస్టారెంట్", "వంశధార లాడ్జింగ్ అండ్ బోర్డింగ్" వంటి వ్యాపారాల్లో వుండేవాడు. అయితే, బంగార్నాయుడూ, బంగార్నాయుడిలా రా జ కీయాల అండతో వ్యాపారాల్లో పోటీ తగిలే వర్గంతో యిబ్బందులెదురయినయి. సారానిషేధకారణంగా - బార్, రెస్టారెంట్ మూతబడింది. డాక్టర్ మిత్రుడొకాయన యిచ్చిన సలహా ప్రకారం "వంశధార ఫార్మాసుటీస్" ఓపెన్ జేసాడు. జిల్లాకు మెడికల్‌కాలేజీ కేటాయింపని ప్రభుత్వ ప్రకటన వొచ్చేక, ఆ మిత్రుని జాయింట్‌తో "వంశధార మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్..." బోర్డు "వంశధారలాడ్జింగ్"కి బదులు తగిలించేసి; మెడికల్ కాలేజ్‌కి అనుమతి సంపాదించేసి - ఆ కోటాలో - రిజర్వు స్థలం కోసం రంగంలోకి దిగేడు బాబ్జీ.

ఈ యిరువురి పోటాపోటీ ప్రయత్నాలు యెరుగని జనం - కాలనీ కోసం దరఖాస్తులిచ్చేరు. పట్నం ఆధారబ్రతుకులు గావటంతో - పేదలకి 'రిజర్వుస్థలం'లో కాలనీ యెంతో ఉపకరిస్తుంది.

పార్వతి - పేదజనానికి హామీ యిచ్చింది! రేపు పంచాయితీబోర్డు సమావేశం. తుఫాన్ తీరం దాటబోతోంది...! ఇంతలో ఈదురుగాలులు...

ఈశ్వర్రావు తన అన్ననీ; పార్వతి తల్లిదండ్రుల్నీ వెంటబెట్టుకు - కుటుంబపంచాయితీ పెట్టేడు. పార్వతి యెన్నో చెప్పింది -

"...సర్పంచ్‌గా ఎన్నికయ్యాక జనం కోసం యేమీ చెయ్యలేదు. ఇదొక్కటయినా చెయ్యకపోతే - యికీ పదవి అనవసరం..." అంది పార్వతి.

"...అందికే, యిస్కో అని యేడ కుక్కకి నేర్పగూడదురా అన్నాను. ఇన్నావా..." అని ఈశ్వర్రావుని ప్రశ్నిచేడు - అతని అన్న.

"...అంటే, నేను వేటకుక్కనా?" చురుక్కున లేచింది పార్వతి.

"నువ్వు - యీడి పెళ్లానివి. ఔనా? ఏఁవర్రా - ఔనా, కాదా?" అని పార్వతి తల్లిదండ్రుల్నీ ప్రశ్నించి -

"ప్రతిమొగోడికీ చేతిలోపు మనిషెవుఁ? ఎవుర్రా మామ, సెప్పురా?" అని పార్వతి తండ్రిని అడిగేడు. పార్వతి తండ్రి - "కట్టుకున్న పెళ్లం. మరెవుఁ?" అని బదులిచ్చేడు.

"కదా. మరాముక్క నీ కూతురికి సెప్పు. మొగుడి గౌరువం తీసీగూడదని సెప్పు. నీనే తగ్గిపోనాను - తమ్ముడు మాటిచ్చేడని! లేకపోతే - బాబ్జీబాబు తరుపుని తీర్మానం సెయ్యమననేటి? మనకేల? ఎవుళయినా వొకటే! బాబ్జీబాబో, బంగార్నాయుడో యెవుళయినా వొకటే! వొకళు వొంటసారా నాంటోళు, మరొకరు గవర్నమెంట్ సారానాంటోళు. ఏది కుదిరితే - అదే సెబాస్ అనుకోవాల! అద్గదీ; తమ్ముడి మాటే కానీయనుకున్నాను. అన్నని! మరి భారియా పెళ్లం కట్టుబడదా? నా భారియా పెళ్లం అయ్యిందిగాదు..." తుందుదులిపి, కోపంగా కేకలెయ్యాసాగేడు ఈశ్వర్రావు అన్న.

"...వోసే్రబావూ? తగ్గు. తగ్గురా! నీ పెళ్లమయితే - అది సర్పంచవుతాదేటి?" పార్వతితల్లి, ఊరుకోలేక జవాబిచ్చింది.

"సర్పంచయితేటి సంసారం సెయ్యడం మానెస్తాదే? నాయురాళయిపోద్దేటే? ఒసేటి...? యిదేనేటి...నువ్వు కూతురికి నేర్పినావు? మొగుడ్ని గడ్డిపరక్కింద తీసెయ్యమన్సెప్పావేటి?" అని దబాయించసాగేడు ఈశ్వర్రావు అన్న. "మొగుడూ, పెత్తనం సంగతులు మాటాడ్డానికి యిది యింటి విషయం కాదు. ఊరి విషయం" కల్పించుకుంది పార్వతి.

"...అందికే, యిస్కో అని నేర్పకరా అన్నాను. యిన్నావా?" మళ్లీ మొదటి పలుకే పలికేడు ఈశ్వర్రావు అన్న.

"...గ్రామ విషయంలో - కుటుంబసభ్యులెవరు కల్పించుకున్నా సర్పంచ్‌గా వాళ్లమీద లీగల్‌చర్య తీసుకుంటాను. ఆఁ. ఇక్కడితో దీన్ని ఆపండి..." అని హెచ్చరించి, యింట్లోకి వెళ్ళిపోయింది పార్వతి.

"...నువ్విక కోకగట్టుకోరా. బొట్టూ, గాజులు కొనీసి తెస్తాను. థూత్..." ఛీదరించుకువెళిపోయేడు ఈశ్వర్రావు అన్న. ఈశ్వర్రావు కోపంగా యింట్లోకి వెళ్లేడు. పార్వతి లోనుంచి బయటికొచ్చింది.

"...ఇదే గుర్తుంచుకో. రేపు నా మాట నిలబడాల. తీర్మానం జెయ్యించాల బలరాం నాయుడికి! ఆఁ. లేన్నాడు - నీకూ నాకూ ఫట్. కులపెద్దలకాడే కలుస్తాం..." అని హెచ్చరించి, వెళిపోయేడు ఈశ్వర్రావు.

పార్వతి అచేతనంగా నిల్చుంది. తల్లి దగ్గరగా వచ్చి -

"...నలుగురూ సెడ్డ అనగూడదు. సెడ్డకి సాయింజెయ్యిగూడదు. అది గుర్తెట్టుకు నడుసుకో... కూతరా..." చెప్పింది.

పార్వతి మనసులో గింజులాట...! చదువుకున్న, పదవిలోనున్న, తను యెందుకింత గింజుకుపోవాల్సి వొస్తోంది? స్త్రీనయినందువలనా? దళితనయినందునా? ఇంటా, బయటా తనకి యెన్ని శక్తులు అడ్డంగా నిల్చున్నాయో... అర్థమవుతోంది!

ఆమె ఆలోచనల్లో ఆమె వుండగా - పంచాయితీ గుమస్తా వొచ్చేడు. అతని వెంట మరోవ్యక్తి...!

"...మబ్బులు గమ్మీసి, గాలి బంధింపయి ఆగిపోయింది మేఘం..." అన్నాడు పంచాయితీ గుమస్తా. పార్వతికేమీ బోధపడ్లేదు.

"రేపటి పంచాయితీబోర్డు మీటింగ్ జరక్కుండా 'స్టే' అట! మన రికార్డుల్ని సీజ్‌జెయ్యమని - జిల్లా పంచాయితీ అధికారి నోటీసట! ఇదిగో తెచ్చేడు. ఇయ్యవయ్యా..." అని గుమస్తా, తన వెంటవచ్చిన వ్యక్తిని నోటీసిమ్మన్నాడు.

ఆ వ్యక్తి, నిశ్చలంగా నిల్చున్నాడు. నోటీసు కమీజు జేబులోనుంది...కవర్లో! గానీ తియ్యడు. ఏ నోటీసూ - యెదుటివ్యక్తి ాంచి రిజర్వ్‌బ్యాంక్ వారి నోటు అందుకుంటేగానీ యివ్వగూడదని అతని నియమం! గుమస్తా గుర్రుగా చూడ సాగేడు.

"...స్టేయా? ఎవరు తెచ్చివుంటారు?" ప్రశ్నించింది పార్వతి.


"...మీరు బంగార్నాయుడికి ఫేవర్ జేస్తారని - బాబ్జీ 'స్టే'కెళ్లాడని టాక్..." పార్వతి ఆశ్చర్యంలోనే వుండగా -"...ఇలాంటి 'స్టే'లు మిట్టకాయ యేసీ లోపు యెత్తించీగల్డు బంగార్నాయుడు. ఫర్లేదులేమ్మా! ఇయ్యవయ్యా కవరు..." గుమాస్తా - ఆ వ్యక్తి జేబులోకి చెయ్యిపోనిచ్చేడు. ఆ వ్యక్తి నోటీస్ పార్వతికి అందించి, గుమస్తా వైపు చూస్తూ- "...తెలిస్తే సెప్పు. తెలప్తోతే షటప్పు! ఆఁ. 'స్టే'ఎవుళుతెచ్చేరు? ఇద్దరూనూ..! ఆఁ! ఆళ్లిద్దరూ జెడ్పీల మేనేజ్ జేసారు. తెలిస్తే సెప్పు. తెలప్తోతే..."అని నోరువిప్పి చెప్పేడు ఆ వ్యక్తి! అప్పటికి పార్వతికి అంతా అర్థమయింది. నోటీసు చదువుకుంది. కర్తవ్యం మనసులో రూపుదిద్దుకోగా - గుమస్తా చూపిన ఎక్నాలెడ్జ్‌మెంట్ రిజిస్టర్‌లో - ఇట్రోతు పార్వతీఈశ్వర్రావుకి బదులు - "రాయిపిల్లి పార్వతి" అని సంతకం చేసింది!

ఆమె నుదుటి సింధూరపు బొట్టులా మిలమిలా మెరుస్తూ - స్పష్టంగా కన్పించిన - పార్వతి సంతకంలోని మార్పుని గమనించిన గుమస్తా - ఆశ్చర్యంగా చూడసాగేడు! ●

# తెలివైన ప్రపంచానికి "ఓపెన్ సెసేమ్"

## ఎన్‌ఎల్‌పి విజ్‌డమ్ - 2

మన భావవ్యక్తీకరణకు భాష ఉపయోగపడుతుందని, సమాచారాన్ని సరైన పద్ధతిలో అవతలివారికి అర్థమయ్యేలా అందించామా లేదా అనే దీన్ని బట్టి మన 'ఎఫెక్టివ్ కమ్యూనికేషన్' ఉంటుందని గతవారం చెప్పుకున్నాం. అలాగే ఎన్‌ఎల్‌పి థెరపీలో మనుషులు ఉపయోగించే భాష, మరీ ముఖ్యంగా కొన్ని పదాలను ఉపయోగించడాన్ని బట్టి అవతలివారి సమస్యను అర్థం చేసుకోవటం సులువవుతుందని చర్చించాం. అలా ప్రత్యేకించి 'క్లూ'లా ఉపయోగపడే భావావేశాల 'సీల్డు పదాల' గురించి కూడా రాయడం జరిగింది.



డాక్టర్ పి.టి.సుందరం
న్యూరోసైకాలజిస్టు

మామూలుగా మనుషులు మూడువిధాలకు చెందిన సీల్డుపదాలను ఉపయోగిస్తుంటారు.

**1. సిజర్ వర్డ్**

'సిజర్‌వర్డ్' అనేది సమాచారాన్ని సెన్సారింగ్ చేసే సమయాల్లో వినబడుతుంది. అంటే పూర్తిగా అనుకున్నది చెప్పలేకపోవడం. గోప్యంగా ఉంచాలనుకోవడం. "ఐతే", "చాలు", "నో,నో", "అలా కాదు" వంటిపదాలు సిజర్‌వర్డ్స్.

**2. బైనాక్యులర్ వర్డ్**

విషయాన్ని లేదా సమాచారాన్ని వక్రీకరించే సందర్భాల్లోనూ, అసంగతంగా వ్యక్తీకరించే సమయాల్లోనూ ఉపయోగించే పదం 'బైనాక్యులర్ వర్డ్'. అంటే విషయాన్ని భూతద్దంలో చూడడమన్నమాట. "ఫ్రస్ట్రేటెడ్", "డిప్రెసెడ్", "వర్రీడ్", "జెలసీ" వంటివి బైనాక్యులర్ పదాలు.

**3. మిర్రర్ వర్డ్**

చెప్పాలనుకున్న విషయానికి లేదా సమాచారానికి మేకప్ వేసి ఉపయోగించడమన్నమాట. అంటే అసలు విషయానికి అయినవీకానివి చేర్చడం. విశేషణాలు ఉపయోగించడం.

"అందరూ","ప్రతిఒక్కరూ", "వారంతా", "మనుషులు" ఇలాంటి పదాలు మిర్రర్ పదాలు.

గతవారం నేను ఒక సస్పెన్స్ సినిమాను టి.వి.లో చూశాను. ఆ సినిమాలో ఒక ఇల్లు ఉంటుంది. ఆ ఇంటిలోకి దయ్యం ప్రవేశించే కొన్ని సెకన్ల ముందు బెడ్ మీద పడుకున్న పిల్లవాడు నీటి గ్లాసులో కదలికలను (అలజడి) గమనిస్తాడు. తల్లికి చెబుతాడు. ఆమె గ్లాసును చూస్తుంది. కానీ పట్టించుకోదు. పైగా పిల్లవాడిమీద ఒక చిన్న దెబ్బ వేసి 'వెధవ పడుకో' (సిజర్ డైలాగ్ అన్నమాట, సమాచారాన్ని కట్ చేసింది) అంటుంది. సరిగ్గా మన మహాభారతంలో అభిమన్యుడు విషయంలోనూ ఇదే జరిగింది. పద్మవ్యూహం నుంచి బయటపడేందుకు మార్గం తెలియకుండానే సమాచారాన్ని కట్ చేసేస్తాడు కృష్ణుడు.

సరే, పిల్లవాడు చెప్పినప్పుడు నిర్లక్ష్యం చేసిన తల్లి తరువాత దయ్యాన్ని గుర్తిస్తుంది. పిల్లవాడి దగ్గరకు పరుగెత్తుతుంది. అక్కడ్నుంచి పిల్లవాడితో పూజగదిలోకి వెళ్ళి తలుపు వేసేసుకుంటుంది. దయ్యం దేవుడి గదిలో ప్రవేశించలేదు. తల్లి చెబుతుంది "ఎప్పుడైనా నువ్వు కష్టాల్లో వున్నప్పుడు దేవుడిని తలచుకో. దేవుడు కాపాడుతాడు. ఆయనకు అన్నీ తెలుసు" (బైనాక్యులర్ వాక్యం). కొడుకు అడుగుతాడు 'ఏ దేవుడు?' (బైనాక్యులర్ వర్డ్). "దయ్యాలు ఒకేఒక దేవుడికి భయపడతాయి. ఆయనే హనుమంతుడు (మిర్రర్ పదం). అత్యంత శక్తివంతుడైన దేవుని రూపంగా హనుమంతుని నిలపడం జరిగిందన్నమాట.

మహేష్‌కు కొత్తగా పెళ్ళయింది. లక్షాయాభైవేలు తీసుకుని కడప నుంచి పారిపోయి హైదరాబాద్‌కు వచ్చాడు. ఫిల్మ్‌నగర్ చేరాడు. అతని స్నేహితులు అతన్ని మోసం చేశారు. ఎన్‌ఎల్‌పి థెరపీ కోసం వచ్చాడు. ట్రీట్‌మెంటు ద్వారా బాగయ్యాడు. ఆ కేసు గురించి మీకు చెబుతాను.

మహేష్: డైరెక్టర్ నా పాటలను కేర్‌లెస్‌గా వినేరీతిని గమనించినప్పుడే నాకు అనిపించింది అతను నా పాటలను తిరస్కరిస్తాడని. నా స్నేహితులు మోసం చేశారు. నేను ఫెయిల్ అయ్యాను. నేను డిప్రెషన్‌లో పడ్డాను. ఫ్రస్టేషన్, విచారం నన్ను పూర్తిగా ఆక్రమించుకున్నాయి. నా భవిష్యత్తు ఏమిటో నాకు తెలీదిప్పుడు.

డాక్టర్ : నువ్వు విఫలమయినట్టు లేదా ఫెయిల్ అయినట్టు ఎలా చెప్పగలవు?

మహేష్ : చాలామంది నేపథ్యగాయకులకన్నా నాలోనే ఎక్కువ ప్రతిభ వుందని డైరెక్టరుకు తెలిసినా అతను నన్ను చిన్నచూపు చూశాడు.

డాక్టర్: మిగతావాళ్ళతో పోలిస్తే నేనే బెటర్ అన్నది పోలికకు సంబంధించిన విషయం అనుకుంటాను. మహేష్ : అవును

డాక్టర్ : నువ్వు 'బాలు'కన్నా బెటర్ అని ఎలా పోల్చి చెప్పగలుగుతావ్.

మహేష్ : నాకు తెలుసుకాబట్టి.

డాక్టర్ : 'నాకు తెలుసు' అన్న వాక్యం నీ వ్యక్తిగత అనుభవానికి సంబంధించినట్టుగా ఉంది.

మహేష్ : అవును నా అనుభవం వల్ల చెప్పగలుగుతున్నాను.

డాక్టర్: మహేష్ ఈ మధ్యనే నేనో పత్రికలో ఆర్టికల్ ఒకటి చదివాను. అందులో సక్సెస్‌ఫుల్ నటులు, ఇండస్ట్రీకి చెందిన ఇతర విభాగాలవారు సినిమా ఫీల్డులో విజయవంతం కావడానికి నాలుగు ప్రధాన లక్షణాలు అవసరమని చెప్పారు. ఒకటి 'టేలెంట్. రెండు 'కాంటాక్ట్స్', మూడు 'హార్డ్ వర్క్', నాలుగు 'పేషెన్స్(సహనం)'.

(మహేష్ మెంటల్‌మ్యాప్‌లో సినిమాల్లో విజయవంతమవడానికి 'టేలెంట్' ఒకటే చాలన్నది ముద్రించుకుపోయింది. మిగతా మూడు అంశాలు అతని పరిగణనలోనే లేవన్నమాట)

మహేష్‌కు నాకు మధ్య జరిగిన మరికొంత సంభాషణ గురించి, నేను ట్రీట్ చేసిన పద్ధతి గురించి వచ్చేవారం చెబుతాను. ●